విడదల నీహారిక-సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో
నిర్వహించబడిన 2013 సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# గురుదక్షిణ



రాత్రి పదిగంటలు.

నర్సాపురం వెళ్ళే బస్సు ఎక్కి కూర్చున్నాను.

నేను వెళుతున్నది మాస్టారు శ్రీనివాసరావు గారిని చూడ్డానికి. ఆయనకిప్పుడు అరవై ఐదేళ్ళు వుంటాయి.

హుందాగా గురువంటే ఇలా వుండాలనే ఆహార్యంతో వుండేవారు. తరగతి గదిలో కుర్చీలో కూర్చున్నాడంటే ఆయనకి అందరూ సమానమే. చేతిలో బెత్తం వుంటుంది కాని అది భయపెట్టడానికి తప్ప ఏ పిల్లాడి వంటినీ ఎప్పుడూ స్పర్శించలేదు. ఏ పాఠమన్నా అనర్గళంగా చెప్పే ఆయన మా లెక్కల మాస్టారు. ఆయన చెప్పిన లెక్కలు మా జీవితాలు గాడి తప్పకుండా చేశాయి. చిన్నప్పట్నించీ మాకు సంపాదించడం గొప్ప కాదనీ దానిని ఎలా ఖర్చు చేయాలన్న దానిమీద మనిషి మనుగడ ఆధారపడి వుంటుందనీ చక్క చక్కటి ఉదాహరణలు చెప్పి మాకు అప్పుడే మార్గ నిర్దేశం చేశారు. అందుకే ఆయన దగ్గర చదువుకున్న అందరం మిగిలిన వారికి కాస్త భిన్నంగా అభివృద్ధి బాటలో ముందంజలో వున్నాం. రెండు నెలల క్రితం అలుమ్నీమీట్ జరుపుకున్నాం అంటే పూర్వవిద్యార్థుల కలయికన్న మాట. మా మాస్టారు గారు వస్తారనుకున్నాకానీ ఆయన రాలేదు. వాకబు చేస్తే తెలిసిందేమిటంటే ఆయనకి ఓపికలేదు. ఎక్కడికీ కదల్లేని పరిస్థితి. అందుకే మాకు విద్యాబుద్ధులు, సమాజం పోకడ విశదంగా తెలియజేసిన మా గురువుగారిని చూడాలనుకున్నాను. బయల్దేరాను.

బస్సు బయల్దేరింది. చల్లటిగాలి ఒంటిని స్పృశిస్తూ నన్ను నిద్రాదేవికి అప్పగించింది. నిద్రలో కలలన్నీ ఆయన గురించే! మా మాస్టారుగారు ఉపాధ్యాయ వృత్తిలో వున్నప్పటికీ అది కేవలం "ఉదరపోషణార్థం కాకుండా నిష్కపటంగా నిష్కల్మషంగా మమ్మల్ని విజ్ఞానవంతులని చెయ్యడానికి ఒక మాధ్యమంగా ఉపయోగించుకున్నారు. నాకు తెలిసి తన గురించి తనెప్పుడూ ఆలోచించుకోలేదు. అహర్నిశలూ మా బాగు కోసమే శ్రమించేవారు. సెలవు వస్తే ఎగిరిగంతులేసే పిల్లల్లా కాకుండా, అయ్యో మన జీవితంలోని ఒక విలువైన రోజుని వృథాగా పోగొట్టుకుంటున్నామే అన్న స్పృహ మాకు కలిగేలా తీర్చిదిద్దారు. కేవలం ఆయన సబ్జెక్టే కాదు ఏ సబ్జెక్ట్‌లో అనుమానమున్నా తీర్చేవారు. ఒకట్రెండు సార్లు మా నాన్న గారికి ఏర్పడిన ఆర్థిక సమస్యల వల్ల పరీక్ష ఫీజు కట్టలేకపోతే నా భవిష్యత్తు పాడవుతుందని తనే ఫీజు కట్టారు. అంతేకాదు నాకు అవసరానికి నోటు పుస్తకాలు కూడా కొనిపెట్టారు. ఇప్పుడంటే విద్య వ్యాపారమైపోయింది కానీ అప్పట్లో గుడి తర్వాత బడిదే పవిత్రస్థానం. ఉపాధ్యాయులు నిబద్ధతగా తమ కర్తవ్యాన్ని నెరవేర్చేవారు. అందుకే తల్లీ తండ్రీ తర్వాతి స్థానం గురువుకిచ్చారు. "గురుబ్రహ్మ... గురుర్విష్ణు.." అన్న శ్లోకం బహుశా అలాంటి గురువులని ఉద్దేశించి వ్రాసిందేనేమో!

తెలవారింది.

నేను ఆత్రుతగా రిక్షా మాట్లాడుకుని ఆయనింటికి బయల్దేరాను. అప్పటికీ ఇప్పటికీ ఊరేం మారలేదు. అక్కడక్కడ సెల్‌ఫోన్లు, డిష్ టీవీలు అమ్మే షాపులు మాత్రం ఊరికి కాస్త అభివృద్ధిని పరిచయం చేస్తున్నాయి. నేను మాస్టారు గారి పాతకాలపు పెంకుటింటి ముందు ఆగగానే జ్ఞాపకాలు మళ్ళీ

ప్రతాప వెంకటసుబ్బారాయుడు, సికింద్రాబాద్, సెల్: 9849036088

చుట్టుముట్టేశాయి. నా చిన్నప్పుడు నేను ఆ ఇంటికి ఎన్నిసార్లు వచ్చేవాడినో! చదువులో నా ఆసక్తిని గమనించిన మాస్టారుగారు నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళి నా సందేహ నివృత్తి చేసేవారు. నేను సెలవుల్లో కూడా ఆసక్తిగా లెక్కల అభ్యాసం చేసేవాడిని. వాళ్ళింటికి వెళ్ళే నాకు ఎప్పుడూ ఏ పనీ చెప్పేవారు కాదు. వాళ్ళింట్లో వాళ్ళు కూడా అంతే! ఎప్పుడన్నా చిన్నగా సహకారాన్ని అందిస్తుంటే.. నా ఉడతాభక్తిని సైతం వారించేవారు. పాఠశాలలో సైతం పిల్లలకి ఏ పనీ చెప్పేవారు కాదు. అందరి మాస్టార్లకీ భిన్నంగా ఉండేవారు.

నేను గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టాను. రిక్షా అతను నా సూట్‌కేస్ పట్టుకుని నన్ను అనుసరించాడు. నాకు మాస్టారు గుర్తొచ్చి అతని చేతిలో నుండి సూట్‌కేసు అందుకొని అతనికి డబ్బిచ్చి లోపలికి వెళ్ళాను. రెండుసార్లు తలుపుతట్టి పిలిస్తే ఎవరో పేదరికం ఉట్టిపడుతున్న ముప్పైఏళ్ళావిడ బయటకి వచ్చింది. నేను మాస్టారికోసం వచ్చిన విషయం చెప్పాను. ఆవిడ నన్ను లోపలికి తీసుకెళ్ళింది. ఇల్లు దరిద్రదేవత కొలువున్నట్టుగా వుంది. చీకటికొట్టంలాంటి గదిలో కుక్కి మంచం మీద పడుకుని వున్నారు మాస్టారుగారు. ఆయన బట్టల నుండి వస్తున్న ఒక రకమైన కమురువాసన నన్ను నిలవనీయడంలేదు. కడుపులో దేవుతోంది. అప్పట్లో ఆయన పరిశుభ్రమైన తెల్లని దుస్తుల్లో సరస్వతీదేవిని తలపిస్తుండేవారు. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆయన పక్కనున్న ముక్కాలి పీటమీద కూర్చున్నాను. ఆవిడ ఆయన్ని లేపి నన్ను పరిచయం చేసింది. గుర్తుపట్టినట్టుగా ఆయన శరీరం సన్నగా కంపించింది. ఆవిడ ఆయన అనుకోవడానికి అనువుగా దిండుని గోడకి ఆనించి ఆయన్ని కొద్దిగా లేపి దాని ఆసరాతో కూర్చోబెట్టింది. నన్ను ఆశీర్వదిస్తున్నట్లుగా చేయి ఆప్యాయంగా తలమీద వుంచారు.

"ఏంటి మాస్టారు ఇలా చిక్కి శల్యమైపోయారు? ..." గొంతు బాధతో పూడుకుపోయింది.

"ఏవైం... దిప్పు..డు? పెద్దవ...యసు... ఎవరై...నా ఇలా...గే వుం..టారు" అన్నారు మాటలు కూడదీసుకుంటూ.

"కానీ మిమ్మల్ని ఇలా చూస్తాననుకోలేదు. మా అందరికీ చక్కటిదారి చూపించిన మీరు... ఇలా దరిద్రదేవత ఒళ్ళో"

"తప్పు.. నేను బా..గానే వున్నాను. నాకున్న... దాంట్లో తృ..ప్తి గానే వున్నాను. నీడ కూడా లేని అభా..గ్యులు ఎంతో మం..ది వున్నారు. వాళ్ళకన్నా నయం కాదూ.. ఈమే నా కూతు..రు. గుర్తుపట్టావా? పాపం చిన్న వయ..సులోనే వైధవ్యం ప్రాప్తిం..చింది. దానికో కూతు..రు. తాతల్నాటి ఈ ఇం..ట్లో ఏదో ఇలా గుట్టు...గా కాలం గడుపుతున్నాం. నాకు సత్తువ.. లేక పాపం దాని మీ...ద ఆధారపడు..తున్నానన్న బాధ తప్ప నాకే చింతాలేదు. నువ్వెలా.. వున్నావు? నా దగ్గర చదువు..కున్న మిగతా..వాళ్ళు కలుస్తు..న్నారా? అందరూ వృద్ధిలోకి వచ్చారా?" ఆసక్తిగా అడిగారు.

"అc... అసలు నేనొచ్చిన కారణమేమిటంటే మన పాఠశాలలోని విద్యార్థులం అందరం కలిసి 'పూర్వ విద్యార్థుల కలయిక' జరుపుకోవాలనుకుంటున్నాం. మాకు విద్యనేర్పిన ఉపాధ్యాయుల్ని సన్మానించాలనుకుంటున్నాం. కాని నిస్సత్తువతో వున్న మీలాంటి వాళ్ళు రాలేరు కాబట్టి ఇలా ఇంటికొచ్చి గురుదక్షిణ ఇవ్వాలని నిర్ణయించాం.' అని చెప్పి సూట్‌కేస్‌లో నుండి కొత్త బట్టలు తీసుకుని వాటి పై తాంబూలం, పాతిక వేలు దక్షిణగా పెట్టి ఆయన వణుకుతున్న చేతుల్లో వుంచి ఆశీర్వదించమన్నట్టుగా ఆయన కాళ్ళకి దణ్ణం పెట్టాను. ఆయన పరిపూర్ణ ఆశీర్వచనాన్ని అందుకున్నాక లేచిన నాతో "ఇంత డబ్బా? నాకో నూట పదహారు రూపాయలు చాలు. నే...ను జీతం తీసు..కునే చదు..వు చెప్పాను. ఊరి..కే కాదుగా. అందు..చేత ఇది నే..ను తీసు..కోలేను" అన్నారు.

"జీతం... ఏమొచ్చేది మీకు? బతకలేక బడిపంతులు అన్న కాలం అది. అత్తెసరి జీతాలైనా.. నిరాశా నిస్పృహలతో మా భవిష్యత్తు అంధకారం చేయకుండా.. మాకు చదువుచెప్పారు. పైగా మాస్టారు గారూ.. ఈ డబ్బు నా ఒక్కడిదికాదు. పూర్వ విద్యార్థులమందరం కలిసి ఒక ట్రస్టు ఏర్పాటు చేశాం. విదేశాల్లోనూ, మంచి ఉద్యోగాల్లోనూ స్థిరపడిన మీ విద్యార్థులు ట్రస్టుకి డబ్బు పంపిస్తుంటారు. మాకు చదువు చెప్పిన గురువులకి ఏదో 'చంద్రుడికో నూలుపోగు'. మాకు ఇదేమి లెక్కకాదు. కానీ మీకు మాత్రం కాస్త ఉపకారమవుతుందని మా ఆశ" అన్నాను.

ఆయన ఏమీ మాట్లాడలేదు. నాకు తెలుసు కాదనలేని విధంగా కట్టడి చేశాను.

నిజానికి మేము అలాంటి ప్రోగ్రామేం పెట్టుకోలేదు. రెండు నెలల క్రితం అలుమ్నీ మీట్లో అందరం కలుసుకొని పాత విషయాలు కలబోసుకున్నది మాత్రం నిజం. ఒకరి ఉన్నతిని మరొకరం ప్రశంసించుకుని పోచుకోలు కబుర్లు చెప్పుకున్నాం. కార్యక్రమానికి వచ్చిన ఒకళ్ళిద్దరు మాస్టార్లకి చిన్నగా సన్మానం చేసి చేతులు దులుపుకున్నాం. శ్రీనివాసరావు మాస్టారిగురించి అడిగితే 'ఆయన లేవలేని పరిస్థితిలో వున్నాడు కాబట్టి పిలవలేదని' సమాధానం చెప్పారు. మనసు చివుక్కుమంది. మాస్టార్ల మార్గదర్శకత్వంలో ఉన్నతినొందిన మేము గురువుల గురించి ఆలోచించం. మా ఉన్నతికి తమ సర్వస్వం ధారపోసిన గురువుల రుణం ఎలా తీర్చుకోగలం? వాళ్ళు నిజంగా ఉద్యోగధర్మంగా బాధ్యత నెరవేర్చారా? లేదే! తప్పుచేస్తే కొట్టారు. విలువలు నేర్పారు. మంచీ చెడు బేరీజువేసే విజ్ఞతనిచ్చారు. కాని వాళ్ళను మనం గుర్తుంచుకుంటున్నామా? పూర్వకాలం విద్యార్థులకి సమస్త విద్యలు ధారపోసిన తర్వాత గురువులు నిర్మోహమాటంగా గురుదక్షిణ అడిగితీసుకునేవాళ్ళు. బహుశా 'ఆశ్రమాన్ని వదిలి వెళ్ళిన విద్యార్థులు మళ్ళీ గుర్తుంచుకుని రారేమో' అన్న తలంపు అయ్యుంటుంది. మనం సంపాదించే దాంట్లోంచి కాస్త తీసి ఆర్థికంగా వెనుకబడ్డ మాస్టార్లకి గురుదక్షిణగా ఇస్తే తప్పేంటి? దేవుడికి సైతం కానుకలు, మొక్కులు చెల్లిస్తుంటాం, సంపాదనకి మార్గంచూపి ఉత్తమ సంస్కారంతో సమాజంలో పౌరులుగా గుర్తింపు పొందేలా చేసిన గురువుల పట్ల మన ఉదాశీనత సరైనదేనా? ఇదే చెప్పి అందర్నీ కన్విన్స్ చేద్దామని ప్రయత్నించా కానీ ఎవరూ నాకు సహకరించలేదు. అందుకే నాకై నేను తీసుకున్న ఈ నిర్ణయం నాకెంతో సంతృప్తినిచ్చింది. 'వచ్చేనెల మరో మాస్టారు గారిని కలవాలి' అనుకుని ఆనందంగా ఇంటికి బయల్దేరాను.